మర్నాడు గాన సభ! "కీర" "చింతింప నేమి ఫలము" అన్న కృతి విసిరింది. శ్రీనివాసరావు సభలో మునుముందు కూర్చుని లయవేస్తూ "అపర శారదా!" అని అభినందించాడు! కీర పాట అవుతూ "లయ విశారదులకు జోహారు" అంది.

.... .... .... .... ....

## ఓ యి చ ం ద మా మా

"రైల్వే ప్లాట్‌ఫారమే చాలా తొడ తొక్కిడిగా వున్నప్పుడు రైల్లో ఎంత ఇరకాటకంగా వుండేనో" అంటూ దృష్టి ఆనించి, ఇంటర్ క్లాసుబండియొక్క లోనికి జారబడే సందు గుమ్మం వెలుపలి రెండు ఇనుపకమ్మలు ఆలా రెండుచేతులా లాగిపట్టినట్టు పట్టి, ఒక్క ఊపున తన వెనుకవున్న జనాన్ని నెట్టి, ముందుకు చొఱబడి, ఎలాగైతేం ఎక్కగలిగింది ఆనాడు అమ్మత్తకాశిని—ఆమె పేరు మధుపాత్ర.—"మధు" అని కూడా పిలవడం ఆమెను ఎఱుగున్నవారి కలవాటేమో కూడా—ఎంచేతా అంటే, ఆమె వెనువెనుకనే ఎక్కే గుంపులోంచి ఒక యువకుడు "మధు ఎక్కగలిగింది బండి! నేనే వెనకబడిపోయినాను. గార్డు ఈలవేశాడు" అనే నిరాశాపూర్వకమైన, ఆయాసభారమైన ఆత్మీయవాక్యం గట్టిగా అనుకోవడం వినవచ్చింది. మధుపాత్ర అప్పటికప్పుడే ఆలా ఆలా ఒక అరలోకి ఇమిడి, కిటికీగుండా ప్లాట్‌ఫారమ్ మీదికి తొంగిచూస్తూ, "ఇలా రావోయి! ఈ కిటికీగుండా దూరవోయి! దీపాలుకూడా లేవు వెధవ బండీకి!" అని

చేయి అందిచ్చింది అవతల వ్యక్తికి. ఆ వ్యక్తి, పైని సూచించిన యువకుడే !

ఆ యువకుడు కిటికీగుండా లోపలకు వురికి,—"థాంకుయు మధు !" అని కిటికీగుండా తొంగిచూస్తూ "హల్లో బోయ్ ! లెమన్‌క్రష్ ! ఒకటి తీసుకురా !—నీకొకటి వద్దూ—ఒకటి కాదు రెండు తీసుకురా !" అని బిగ్గఱగా అఱిచాడు. మధు ఆ యువకుని వీపుమీఁద అట్టే చఱచి చఱచి "ఇలా ముందు కూర్చో ఈ బల్లమీద !—వాణ్ణి ఏమిటి తెమ్మన్నావు ! ఈ "వుమెన్‌క్రష్" చాలు లెమన్‌క్రష్ అక్కర్లేదు నాకు. పెద్ద ఫీటు అయిపోయిందే బండిలోకి ఎక్కడం ! ఆడది అని ఒక్కడికి గౌరవంలేదు ! తప్పుకోవడంలేదు. చూచావు ! నేను ఎల్లా ఎక్కగలిగానో !—నేను గుమ్మంవద్దవున్న రెండు ఇనుప ఊచలూ ఆలా రెండు చేతులా పట్టుకొని అమాంతంగా ఒక్క ఊపులో లోపల కురికాను, నా వెనుక వాళ్ళెవళ్ళూ పడిపో లేదు గదా ?" అని ఉత్తచేత పాలభాగం ఆ చెమటూడ్చుకుంది. యువకుడు తన చేబురుమాలు అందిస్తూ, ఆమె "నో ! థాంక్సు" అంటూంటే "కొత్తవుతుకుదే" నంటూ "పడితే మొదట పడే వాణ్ణి నేనే అయియుండవలసింది" అన్నాడు. "మఱి పడిపో లేదే నీవు ?" అంది మధు.

యువకుడు "నీయెదుటు చూచి వెనక్కు తప్పుకున్నా"

మధు : "నీవు తిరిగి గుంపులో పడిపోయావన్నమాట ! వాట్ ఏపిటీ ! నేను కేకవేసి యీ కిటికీగుండా చేయి అసరా యివ్వకపోతే ఆలా ప్లాట్‌ఫారమ్ మీద వుండిపోయే వాడవన్న మాటే." అంది బల్లమీది మెత్త యువకుని జేబురుమాల్తో, దుమ్ము పోయేలా కొడుతూ—

యువ : " లోపల అంతా ఖాళీగానే వుంది ? "

మధు : " ఖాళీగానూ వుంది. చీకటిగానూ వుంది ! "

అంతలో ఇంజన్ కూసింది. రైలు సాగడం ప్రారంభించింది. ప్లాట్‌ఫారమ్ మీది దీపాల వెలుగువీళ్ళ అరలోకి అప్పటప్పట కాస్తదూరం ప్రసరిస్తూ, లోపల ఇంకావున్న ప్రయాణీకుల్ని చూపించింది. దాంతో మధు తన వాగ్ధోరణి తగ్గించి— " దీనిలో మనమేకాదు. ఇంకా ఇతర స్త్రీలూ పురుషులూకూడా వున్నారు. "

యువ : " ఉన్నా ఈ మెత్త అంతా ఖాళీగానే వుంది ! " అని ఎదరమెత్తకేసి చూచాడు. ఎదర మెత్తమీద ఓ దంపతులు పూర్తిగా ఆబరించుకు కూర్చుని వున్నారు.

ప్లాట్‌ఫారమ్ దీపపు వెలుగున కనబడ్డ తక్కిన యావన్మందీ దంపతుల మధ్యనుగాని వారి ప్రక్కప్రక్కనగాని కూర్చోవడముకు ఆలోచిస్తూ నిలబడి వున్నారు.

ఆలోచించిన కొద్దీ బండీ అంధకారమయమై పోతూవుంది. మాటదే చైతన్యం ! దంపతుల్లో మగవాడు " ఇప్పుడేనండి ఆ మెత్త ఖాళీ అయింది. "

మధు : " ఏలా దిగిపోయినారు ఆ జనం ? నేను గుమ్మానికి అడ్డంగా ఇనపఖడ్డీపట్టుకు ఎక్కడంలో ఎవరూ దిగలేదే ఈ బండిలోంచి " అంది.—" మీరు సందులో వుండివుంటారు. వీరు కిటికీగుండా దిగిపోయినారు "—

మధు : " మెత్త అంతా ఖాళీ ? "

ఆ వింత వ్యక్తి : " దానిమీద కూర్చున్నవాళ్ళు అందరూ దిగిపోతే అంతా ఖాళీగాక మరేమి ? "

యువ : "కిటికీలోంచి దూకారూ అంటే మన ఏజ్ (Age) వాళ్ళే అయియుండాలి"—"తమ ఏజ్?" అని అడిగాడు నిలబడ్డవారిలో ఒకాతడు. యువకుడు "మాది కాలేజ్ (College)" అన్నాడు.

"వాళ్ళూ ఎదో కాలేజివాళ్ళమే అన్నారు కాదండీ?" అంది దంపతుల్లోని భార్యా. "కాలేజి అంటే ఏజికాదు తల్లీ అదో సంస్థ!" అని పకాల్న నవ్వింది మధు. నవ్వుతూ "ఇంత కొలాసల్ ఇగ్నోరన్సుతో ఇంత అద్భుతమైన అజ్ఞానంతో ఈ గాడీ ఎల్లా ఎక్కగలిగావమ్మా నీవు! ఈ మగవాళ్ళను తోసికుంటూ రాసుకుంటూ?" అంది. అవతల ఆమె "నేను నాభర్తా గుమ్మందగ్గఱ పారలెల్ (Parallel) గా వున్న ఇనపఖడ్డీలు—ఒకరొక ఖడ్డీ, ఒకరొక ఖడ్డీ పట్టుకు రెండో వ్యక్తి నెక్కనివ్వకుండా ముందు ఎక్కి కూరుచున్నాము" అంది. "పారలెల్ అన్న మాటలో ఎదో వింతస్ఫురించి తానెఱిగిన గొంతుగా గుర్తించి బ్యాటరీలైటు ఆమె ముఖమ్మీదకు వేసింది. వేస్తూ "సుధీ! నీవుటే? ఎవరో అనుకున్నాను." అని బొత్తం తేల్చింది. తిరిగి అర అంతా అంధకారబంధురం—సుధీ "నేనే! మేం మేరియేజి (Marriage) చేసికొని యిలా ఇంటర్లో—"తేనెతోకూడిన చంద్రబింబం" అనుభవిస్తున్నాం. "హనిమూన్" కు తెనుగు అంతే అంటావా?"

మధు : "ఇంటర్లో! అంధకారంలో!"

రెండోప్రక్క కిటికీలోంచి గాలికి తొంగిచూస్తూవున్న గుంపులోని ఓ అందకత్తె చటాల్న ఇటుతిరిగి "మధుపాత్రా! చంద్రోదయం అవుతూవుంది! ఇటుచూడు!" మధు పెద్దకీచు

గొంతుతో—మధు పాత్రవి వేయిగొంతులు—"నీవూ వస్తూ వున్నావుటే ఈ బండిలో సుఖీ! ఎలా ఎక్కగలిగావు?" అంది. సుఖి "నేను ఈ తట్టునుంచి ఎక్కాను ప్లాట్‌ఫారమ్ వైపు "పోసబిలిటీ" వుండదని—నేను రెండు ఇనపఖడ్డీలు గుమ్మం దగ్గరవి పట్టుకుని పైకి "పుల్ అప్" తీసికొని ముందుకు బండిలో పడ్డాను. అది ఒక పెద్ద స్కిల్! ''—

మధు: "కిక్! నేను ఈ వెధవబండిని ఆ ప్రక్కకు పడగొట్టి పారలెల్ బార్ మీదలా గుమ్మంవద్దవున్న ఇనప ఊచలు పట్టుకు "ఎల్బోమార్చి'' చెయ్యాలనుకున్నాను. అది నిజంగా జరిగివుంటే నీవు నలిగి పోయియుందువు!''

సుఖి మధునువింటూ, తిరిగి చంద్రోదయ కాంతిగంటూ ''ఓయి! చందమామా! నీవు ప్రకాశిస్తు వున్నంతలో అంత ట్రాజెడీయే నాకు?'' అని అనుకుంది. ఆమెతోపాటు రైలు కూడా అంత తనకీ ట్రాజెడీయే? అనుకొన్నట్టు పొగను చంద్రునికేసి వదిలింది.

.... .... .... .... ....

## గండినే మొండి జీవనం

ఊరుపేరు చెప్పినా, మనిషిపేరు
చెప్పినా అంతా ఎగబడతారు
తెలుసుకోడానికి. పేరులో అంత చమత్కారం వుంది. అయితే కథలో చమత్కారం వున్నప్పుడు పేరుతో నిమిత్తం లేదు. చదివేవానికి స్ఫురిస్తేచాలు. ఎక్కడ వుంది ఆవూరు, ఎవరా మనిషి అని!